క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: నిజాంపేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. బాలాజీ కాలనీ రోడ్ నం.4, 5, వెంకట్రాయకాలనీ, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం ఫేజ్-1, వినాయక్‌నగర్, న్యూ శ్రీనివాస్‌కాలనీ, కేటీఆర్‌కాలనీ రోడ్డు నం.5,6,7లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెన్నెలగడ్డ, బజరంగ్ హిల్స్, బౌద్ధనగర్, దుర్గా విహార్, వసంత విహార్, ఆర్మ్స్‌బర్గ్ కౌండిన్య అపార్ట్‌మెంట్స్, గణేష్‌నగర్, మహానగర్ ఎన్‌క్లేవ్, రుక్మిణి ఎన్‌క్లేవ్, జయరామ్‌నగర్, జె.కె.నగర్, కృష్ణానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్లెజెంట్ విల్లాస్ నూతన కార్యవర్గం

నిజాంపేట్: బాచుపల్లిలోని ప్లెజెంట్ విల్లాస్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అధ్యక్షుడుగా సంకినేని శ్రీధర్‌రావు, ఉపాధ్యక్షుడు వేణుగౌడ్, కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా కె.సదాశివరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. కొంత కాలంగా కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కారించడమే తమ ముందు ఉన్న ఎజెండా అని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. గతంలోని పాలక వర్గం సూచనలు, సలహాలు తీసుకుని ముందుకు సాగుతామన్నారు. నూతన కమిటీ సభ్యులు గతంలో అసోషియేషన్ బాధ్యతలు నిర్వహించిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ దుర్గారెడ్డి, సభ్యులు జానాకీనాథ్ ప్రమాణస్వీకారం చేశారు.

'హాల్ ఆఫ్ గేమ్' గేమింగ్ జోన్ ప్రారంభం



కుత్బుల్లాపూర్: సరికొత్త క్రీడా వినోదాన్ని పంచేందుకు కొంపల్లిలో నూతనంగా ఏర్పాటుచేసిన హాల్ ఆఫ్ గేమ్ గేమింగ్ జోన్‌ను ఆదివారం సినీనటుడు, డీజే టిల్లు ఫేమ్ సిద్దు జొన్నలగడ్డ, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సానియా మీర్జా సోదరి ఆనం మీర్జాలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. దాదాపు 100 క్రీడలు, వీఆర్ గేమ్స్, బౌలింగ్ ఆలే, పార్టీ వేడుకలకు సంబంధించిన జోన్‌లను నిర్వాహకులు ఒకే చోట ఏర్పాటు చేశారు. గేమింగ్ జోన్‌ను ప్రారంభించిన సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ.. ఆనందాన్ని రెట్టింపు చేసే ప్రాంతం ఇదని అన్నారు. చిన్నారులు, యువతను హాల్ ఆఫ్ గేమింగ్ జోన్ ఖచ్చితంగా కట్టి పడేస్తుందన్నారు. హాల్ ఆఫ్ గేమ్ డైరక్టర్ హితేష్ చందానీ మాట్లాడుతూ... సరికొత్త గేమింగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కుటుంబంతో ఇక్కడ ఆనందంగా సమయం గడపవచ్చన్నారు. నాలుగు లేన్ల బౌలింగ్ ఆలేతో పాటు పార్టీ జోన్లు, ఫుడ్ కోర్టులు అన్నింటిని ఒకే చోట అందుబాటులో తీసుకొచ్చామన్నారు.

నేడు పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కమిషనర్ శ్రీహరి ఓ ప్రకటనలో తెలియజేశారు. కొంపల్లి 1వ వార్డు, 6వ వార్డులోని అపర్ణ పామ్ గ్రూవ్స్ సెప్టిక్ ట్యాంక్ నుంచి దూలపల్లిలోని అశోక-ఏలా-మైసస్ కల్వర్ వరకు రూ.288.15 లక్షలతో చేపట్టబోయే పైపులైన్ పనులకు రాష్ట్ర కార్మిక శాఖమంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లతో పాటు మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై శంకుస్థాపన చేయనున్నారు.

పర్మిషన్ రెండంతస్తులు.. నిర్మాణం ఐదంతస్తులు!

నోటీసులకు బెదరరు.. నిర్మాణాలు ఆపరు

కుత్బుల్లాపూర్: అదనపు అంతస్తులకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. నిత్యం ఎక్కడో ఒకచోట కూల్చివేతలు చేపడుతున్నా అక్రమార్కులు మాత్రం ఊరుకోవడం లేదు. ఇంకేముంది ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతూ టౌన్ ప్లానింగ్ అధికారుల జేబులు నిండుతున్నాయి. పర్మిషన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం.. తద్వారా లబ్ధి పొందడం వీరి వంతు కాగా... జోనల్ విజిలెన్స్ విభాగం పేరిట మరికొంత మంది రంగంలోకి దిగి అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి జీడిమెట్ల డివిజన్‌లో ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలు ఊపొందుకున్నాయి. వీరిని కట్టడి చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు వారిచ్చే లంచాలపైనే ఆధారపడుతూ అక్రమార్కులకు అండదండగా ఉంటున్నారు. దీంతో విచ్చలవిడిగా ఎటువంటి అనుమతులు లేకుండా. జీ ప్లస్ వన్, టు పర్మిషన్ తీసుకొని ఏకంగా నాలుగైదు అంతస్తులు వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.
- అయోధ్యనగర్ ప్రధాన రోడ్డు పక్కనే ఓ దేవాలయం అనుకుని 100 గజాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా జీ ప్లస్ త్రీ నిర్మాణం చేపట్టడం ఈ నిర్మాణం విషయంలో టౌన్ 'ప్లానింగ్'అధికారులదే కీలక పాత్ర అని గుసగుసలు వినిపిస్తున్నాయి. లక్షల్లో డబ్బులు ముట్టజెప్పి నిర్మాణాన్ని చకచక పూర్తి చేస్తున్నారు.



రాఘవేంద్ర కాలనీలో అనుమతులు లేకుండా అదనపు శ్లాబ్‌లు వేసిన దృశ్యం

- అదేవిధంగా గోదావరి హోమ్స్ సమీపంలోని రాఘవేంద్ర కాలనీ లో ఓ వ్యక్తి జీ ప్లస్ టు పర్మిషన్ తీసుకుని అదనంగా ఓ నిర్మాణం ఆపై పెంట్ హౌస్ నిర్మించడం ఈ నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి ఎలాంటి కూల్చివేతలు చేయకపోవడంపై జోనల్ విజిలెన్స్ విభాగం సిబ్బందిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



అయోధ్యనగర్ ప్రధాన రోడ్డులో నిర్మాణం

- సదరు అక్రమ నిర్మాణదారుడు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే బంధువు అధికారులకు భారీ ఎత్తున డబ్బులు ముట్టజెప్పి నిర్మాణాన్ని చేస్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.
- ఈ విషయంపై కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాంబయ్యను 'సాక్షి'వివరణ కోరగా.. రాఘవేంద్ర కాలనీలో నిర్మించిన అక్రమ నిర్మాణానికి ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేశామన్నారు. జోనల్ టాస్క్‌ఫోర్స్ విభాగానికి లేఖ కూడా రాశామని తెలిపారు. వారే కూల్చివేస్తారని చెప్పడం విశేషం. అదేవిధంగా అయోధ్యనగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణం విషయం తనకు తెలియదని పేర్కొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై బీజేపీ నేత ఫిర్యాదు

చంపేస్తానని పోస్ట్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

జీడిమెట్ల: తనను చంపేస్తానంటూ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కత్బుల్లాపూర్‌కు చెందిన నల్లా జైశంకర్‌గౌడ్ బీజేపీ మేడ్చల్ జిల్లా అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా ఉన్నారు. ఆయన కొన్ని నెలలుగా కుత్బుల్లాపూర్‌లోని గాజులరామారం, జగద్గిరిగుట్ట, ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి అవుతున్నాయని సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెడుతున్నాడు. కొన్ని సార్లు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కబ్జాదారులకు అండగా ఉంటున్నారంటూ సైతం పోస్ట్‌లు చేశారు. కబ్జాలు జరిగిన ప్రతిసారి జైశంకర్‌గౌడ్ ఎమ్మెల్యే, వారి అనుచరులపై సోషల్ మీడియా వేదికగా విరుచుకు పడుతున్నారు. ఈనెల 14న జయశంకర్‌ను చంపుతానంటూ బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ ఫేరోజ్ పేస్‌బుక్‌లో వీడియో పోస్ట్ చేశాడు. దీంతో తనకు మహ్మద్ ఫేరోజ్, అతని అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డితో కలిసి జైశంకర్‌గౌడ్ జీడిమెట్ల సీఐ పవన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ఆర్టికల్ 19ప్ర కారం ప్రతి మనిషికి ప్రశ్నించే హక్కు ఉందన్నారు. అందులో భాగంగానే తాను ప్రశ్నించానని తెలిపారు. తాను దేశ పౌరుడిగా ప్రశ్నిస్తే తనను చంపుతానంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. దీనికి స్పందించిన సీఐ పవన్ దర్యాప్తు చేస్తానని తెలిపారు.



ఫిర్యాదు చేసిన అనంతరం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ నాయకులు

భగత్‌సింగ్‌నగర్ నూతన అడ్‌హక్ కమిటీ

చింతల్: చింతల్ డివిజన్ పరిధి భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం కాలపరిమితి ముగిసింది. ఆదివారం కాలనీవాసులు స్థానిక కమిటీ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించి అడ్‌హక్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అడ్‌హక్ కమిటీ సభ్యులుగా రాజిరెడ్డి, భూపాల్‌రావు, దేవయ్య, సుభాష్, వెంకట్‌రెడ్డి, రవీందర్, నరసింహ బ్యాంకు, పి.నరసింహ, పుండరీకం, వెంకటేశం, శ్రీనివాస్‌రెడ్డిలు నియమితులయ్యారు. అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో బస్తీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సమావేశంలో కామ్రేడ్ సత్యం, రవీందర్‌రెడ్డి, గడ్డం రామ్, వరదరాజ్, మల్లేష్, సామ్రాట్, ప్రభాకర్ యాదవ్, బీసు వెంకటేశంగౌడ్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నాం

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా 45వ రోజు ఆదివారం ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయనగర్‌లో మాజీ కార్పొరేటర్ గౌరీష్‌తో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రూ. కోటి సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన ప్రభుత్వ పాఠశాల పనులతో పాటు ఇటీవల పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. తమ కాలనీలో అభివృద్ధి పనులను పూర్తి చేసి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు కాలనీ మహిళలు మంగళ హారతులు పట్టారు.

- అనంతరం ఎమ్మెల్యే వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో ఏదైనా సమస్య పరిష్కరించాలంటే సంవత్సరాలు పట్టేదన్నారు. ప్రభుత్వ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రోజుల్లోనే పరిష్కారానికి నోచుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఏ ఇబ్బందులు వచ్చినా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సోమేశ్‌యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకుడు కిషోర్‌చారి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు హారతులు పడుతున్న మహిళలు..

- నిజాంపేట్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాఘవేంద్రరావు, సురేష్‌రెడ్డి, కౌన్సిలర్ సర్వారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎంసీ ప్రెసిడెంట్ రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెపా కూకట్‌పల్లి మండల నూతన కమిటీ

నిజాంపేట్: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) కూకట్‌పల్లి మండల నూతన కమిటీని ఆదివారం కూకట్‌పల్లిలోని మెపా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వార్ల వెంకటయ్యముదిరాజ్, ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన నీరటి చెన్నయ్యముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా కూకట్‌పల్లికి చెందిన చక్రాల వెంకటయ్య ముదిరాజ్‌ను ఎంపిక చేస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య ముదిరాజ్, హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతికి, రిజర్వేషన్ల సాధనకు రాజకీయాలకు అతీతంగా పని చేస్తామన్నారు. తమ ఎంపికకు సహకరించిన మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజీవన్ కుమార్, విజయకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



దేశంలో తిరుగులేని నాయకుడు కేసీఆర్

ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

నిజాంపేట్: దేశంలో తిరుగులేని నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తింపు ఇస్తారని... పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం బాచుపల్లి, నిజాంపేట్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిజాంపేట్‌లోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీని మించిన పార్టీ రాష్ట్రంలో మరొకటి లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేక విపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు.

- విపక్షాలు చేసే తప్పుడు ఆరోపణలపై ఎప్పటికప్పుడు నాయకులు, కార్యర్తలు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం పదవుల కోసం, బీజేపీ, కాంగ్రెస్ నేతలు రాజకీయ లబ్ధికోసం దిగజారుతున్నారని విమర్శించారు. తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఉక్కు సంకల్పంతో దేశ రాజకీయాల్లో అడుగుపెట్టి దూసుకుపోతున్న కేసీఆర్ వెంట మనమంతా అండగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో విజాయాలు సాధించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.



- మోటర్లకు మీటర్లు పెట్టాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని దీనిని అడ్డుకోవాల్సిన అవసరం మనపై ఉందన్నారు. తెలంగాణ కోసం నిధులు ఇవ్వాలేని కేంద్రం తెలంగాణ కోసం మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ కోలను నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీమేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఫ్లోర్‌లీడర్ ఆగం పాండు, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు, నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, కార్పొరేటర్లు కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ వివిధ విభాగాల నాయకులు, కార్యర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తా



సమస్యలు పరిష్కరించాలని అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

జీడిమెట్ల: అధికారులతో మాట్లాడి కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని ప్రభుత్వ శాశనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌కు చెందిన వివిధ కాలనీల ప్రజలు ఎమ్మెల్సీని కలసి వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మన హైదరాబాద్ అన్ని రంగాల్లో దేశంలో నంబర్‌వన్‌గా నిలుస్తుందని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అవసరాలను తెలుసుకుని ముందుగానే ప్రణాళికను తయారు చేసే పార్టీ కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు.

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

నిజాంపేట్: నిజాంపేట్ శ్రీనివాసకాలనీలోని భూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన స్వామివారి గరుడ వాహన మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ పూజాల్లో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ రాఘవేంద్రరావు, సబితా, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని పరిష్కరించడంలో అధికారులు విఫలం

నిజాంపేట్: ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొలను హన్మంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాచుపల్లి పరిధిలోని సాయినగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యతో పడుతున్న ఇబ్బందులను స్థానికులు హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన హన్మంత్‌రెడ్డి ఆదివారం సాయినగర్‌లో పర్యాటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జ్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను వెంటనే పరిష్కారించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళన నిర్వహిస్తామని హెచ్చారించారు.



సాయినగర్‌లో ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్న హన్మంత్‌రెడ్డి

ఈ సందర్భంగా అప్పటికప్పుడు హన్మంత్‌రెడ్డి ట్యాంకర్‌నే తెప్పించి ప్రజలకు నీటిని అందజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల హరిజన బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఆయన పరిశీలించారు. కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని, దోమలతో ఇబ్బందులు పడుతన్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన భరతసింహారెడ్డి సంబంధిత అధికారులకు సమస్యను వివరించి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. బస్తీ వాసులు బీరప్ప, రాజు, అరవింద్, శ్యామల, కిషోర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

జీడిమెట్ల: ఆర్టీసీ బస్సు ఢీకొని పెట్రోల్‌బంక్‌లో పని చేసే క్యాషియర్ మృతి చెందిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బాలరాజు(41) కొంపల్లిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఆదివారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన బాలరాజు సాయంత్రం షాపూర్‌నగర్‌లోని శుభమ్ హోటల్ సమీపంలో ఉన్న బస్టాప్ వద్ద బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే అతను ఆర్టీసీ బస్సు కింద ప్రమాదవశాత్తు పడ్డాడా లేదా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సు ఢీకొని వెనుక చక్రాల కింద పడి మృతి చెందాడా అనేదానిపై స్పష్టత లేదు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాహుబలి భోజనం తింటే రూ.లక్ష బహుమతి

అమీర్‌పేట: నాయుడు కుండ బిర్యానీ రెస్టారెంట్‌లో బాహుబలి థాలి భోజనం పూర్తిగా తినే వారికి రూ.1 లక్ష బహుమతిగా ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఎస్ఆర్‌నగర్ బీకేగూడ మున్సిపల్ వార్డు కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను ఆదివారం రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు.రూ.1999 చెల్లించి బాహుబలి భోజనం తీసుకుంటే అందులో ఉన్న ఆహార పదార్థాలన్నింటినీ 30 నిమిషాల్లో తిన్న వారికి రూ.లక్ష బహుమతి ఇస్తామని నిర్వాహకులు వర నాయుడు తెలిపారు.



డ్రైనేజీ పైపులైన్‌పై శ్లాబ్ లేదు

అసంపూర్తి పనులు కొత్త చిక్కులు తెచ్చి పెడుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి విజయ్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డులో ఇటీవల సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. రోడ్డు పనుల్లో భాగంగా జేసీబీతో తవ్వకాలు చేపట్టే సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాలనీ ముఖద్వారంలో ఉన్న డ్రైనేజీ పైపులైన్ పైకప్పు ధ్వంసమైంది. దీంతో ఈ ప్రాంతంలో మూడె అడుగుల మేర గొయ్యి ఏర్పడటంతో ప్రమాదకరంగా మారింది. సీసీ రోడ్డు పనులను పూర్తిచేసి దాదాపు 20 రోజులు కావస్తున్నా నేటికి డ్రైనేజీ పైపులైన్‌పై శ్లాబ్‌ను ఏర్పాటు చేయడంలో అధికారులు తాత్సర్యం చేస్తున్నారు. దీంతో వేగంగా వచ్చే కార్లు, ద్విచక్ర వాహనదారులు గొయ్యిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజయ్‌నగర్ కాలనీవాసులు కోరుతున్నారు. - రంగారెడ్డినగర్



రోడ్లపై అక్రమ పార్కింగ్‌ను అడ్డుకోండి

జీడిమెట్ల: రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసి ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జీడిమెట్ల పారిశ్రామికప్రాంతం నుంచి ఎస్.ఆర్.నాయక్‌నగర్, అపురూపాకాలనీ వెళ్లే రోడ్డులో నిత్యం పదుల సంఖ్యలో లారీలను పార్కింగ్ చేస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బంది కలుగజేస్తున్నారు. రోడ్డుకు సగభాగం వాహనాలు పార్కింగ్ చేస్తుండగా ఇతర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఇతర రాష్ట్రాల నుంచి లోడింగ్ అన్‌లోడింగ్ నిమిత్తం వచ్చే లారీలు ట్రక్కులు గంటలపాటు రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో కొన్నిసార్లు ఎదురెదురుగా వాహనాలు వచ్చినపుడు వాహనాలు సక్రమంగా వెళ్లలేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు అంటున్నారు. వాహనదారులు ట్రాఫిక్ అధికారులు, ఇండస్ట్రీయల్ అథారిటీ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



జీడిమెట్ల ఫేజ్-3లో..

కుక్కల బెడద



మైసమ్మనగర్ రోడ్డులో..

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిదిలోని పలు కాలనీలలో కుక్కలు బెడద ఎక్కువైంది. మగ్దూం నగర్, సీసాల బస్తీ, రింగ్ బస్తీ, మైసమ్మ నగర్, రాజీవ్ గృహకల్ప, అంజయ్య నగర్‌లలో ఈ కుక్కల బెడద మరీ ఎక్కువైంది. ఇటీవలే సీసాల బస్తీలో 15 సంవత్సరాల యువకుడిని 4 వీధి కుక్కలు వెంబండించి మరీ కరిచాయి. అలాగే మైసమ్మనగర్‌లో రాత్రి 7గంటల నుంచి జనం బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఎటువంటి ప్రాణహాని జరగకముందే తగు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029